తడిమంటకి పోసిన నీళ్లు

శ్రీ బుచ్చిబాబు

నీళ్లకోసం నదిఒడ్డు కొచ్చింది అలిమేలు ఆకాశ మంతా మబ్బుతో కమ్ముకున్నా పశ్చిమాన్ని తెరతీసినట్లు నిర్మలమైన ఆకాశం ఎఱ్ఱటితామరాకులా కొండవెనుక దిగిపోతున్న సూర్యబింబం కిరణాలవెలుగులో గర్భాలయంలో ఒంటి దీపంలా మెరుస్తూంది. ఆ కిరణాల ఎరుపు అలిమేలు మొహాన్ని కప్పించి, జడలో దాక్కుంది. లేత మబ్బురంగుఛాయ, స్ఫుటంగా ముందుకు సాగారి ఒంపుతిరిగిన కనురెప్పల కింద తెల్లచేప పిల్లలల్లే సంధ్యలో చిట్లించి కదిలిమెరిసే కళ్ళు, సన్నటి, పొట్టిముక్కు, తీర్చిదిద్దిన సన్నటిపెదవులు, పల్చటి చెక్కిళ్ళు, క్రమంలేకుండా దువ్వినజడ—ఇవన్నీ అమాయకంగా కనబడేటట్లుచేసినా, మొత్తం శరీరంచూస్తే అనుభవంగల వ్యవహర్తలా కనిపిస్తుంది, అలిమేలు. ఎత్తైన విగ్రహం, గుండ్రంగా, బలంగా కనబడేభుజాలు, స్తనాలు, పిరుదలు,—ఆ పాత తెల్లచీర మడతల్లో ఇమడక, వాటివునికిని ప్రతికదలికలోనూ బుజావుచేస్తున్నట్లుంటుంది.

కొండకింద దిగే సూర్యుడంటే అలిమేలుకిష్టం బిందెకిందపెట్టి, సంధ్య వెలుగుకి ఎఱ్ఱబడిన చేతులు చూసుకుని సంతోషపడింది ఇంకా ఎరుపుగావుంటే ఎంతబావుండును, తను. కర్మ, అమ్మనలుపు అయ్యకూడా నలుపేనట, అమ్మ చెబుతుంది.

ఊరికే ఆ పొద్దంతా, ఆ ఎంకడు జొరపడుతూండాడు ఆలోచనలోకి. ఆసైకిలు కొట్టు వెంకటేశ్వర్లు ఈమధ్య మరీ గర్వంగా, హుషారుగా వున్నాడు వాళ్లవళ్లతోనో తిరుపతివెళ్లి, వెంకటేశ్వరస్వామిని చూసి వచ్చాడంట అందుకు ఆ మిడిసిపాటు మాబాగా అయింది! సైకిల్ పోటీలోపడి కాలుకి గాయం తగిలింది కట్లు కట్టి కుంటుకుంటూ తిరుగుతూండా డా ఎంకన్న. మిడిసిపడే వాళ్లకి తగిన శాస్తి చేస్తాడు ఆ ఏడుకొండలవాడు. కాని పాపం మంచోడు—వెంకటేశ్వర్లు—వెంకన్న, తనికి ఒక చందనం బొమ్మ—స్వామిది—తెచ్చి ఇచ్చాడు. వెంకన్న బాగుంటాడు, భలేనవ్విస్తాడు, నవ్వుతాడు—నవ్వితే మరీ బాగుంటాడు—మాంచి నునుపైన ఛాతీ—

ఈ ఆలోచన కూడదు. దాన్ని తొలగించడం కోసం అమ్మనిగురించి అనుకోవల్సి వస్తూంది. అమ్మ మంచిది తనంటే పంచ ప్రాణాలూను పొద్దు ననగా వెళ్లింది సంతకని—ఆ ఎంకడితో—మళ్లా వెంకడి ఆలోచనా? ఇంకా రాలేదేం చెప్మా. తనని తిరుపతి తీసుకెడతానంది— పెండ్లయినాక పెళ్లేంటి తనకి ? కనపడ్డవాడి నల్లా అడుగుతుంది వెఱ్ఱిది—'కాపీ వుచ్చుకోకుండా కట్టుకుంటావా' అని.

తలెత్తి దూరంగా చూసి అదిరిపడింది అలిమేలు అదేమిటి అంత లావుగా పొంగిపోతుండే నది—ప్రొద్దుటాళ అంత లేదే 'అమ్మో'—గుండెల మీద చెయ్యి పెట్టుగుని నిర్ఘాంతపోయి చూస్తోంది. నీళ్లు ఎఱ్ఱగా, ఎత్తు అలలగా లేచి రొదిస్తూ విరిగిపడుతున్నాయి భలే జోరు—సైకిల్ పోటీలా. నురుగు గుండ్రంగా గాలిలో పత్తిలా తిరిగిపోతూంది చలిగా ఉంది. సూర్యుడు లేడు. కొండెనక దిగి, రోతతో వూసినట్లు విచ్చిన తాడిపండల్లే ఉండాడు ఆ మూల ఆకాశరామన్న

నీళ్ల కెట్లా దిగేది ? చీరకొంగు చుట్టూ లాక్కుని బిగించి, సిద్ధపడింది నీళ్లెట్లా తాగేది ? రోతనీరు అంతా కంకరమన్ను రంగు ఓ యబ్బ, అవన్నీ కంప, కొమ్మలు, ఆకులు, దూలాలు, ఎక్కడనించో కొట్టుకుపోతూన్నాయి. భయంలేదు. మనుషు లున్నారు లెక్కపెట్టింది. ఏడుగురు మనుషులు—సిద్దీల్లాంటి వాళ్ళు, నల్లదూలాలల్లె. ఒడ్డుకెళ్లి నీళ్లల్లో కొట్టుకొచ్చే గంప, పీచునార, దూలాలు పట్టుకుని ఒడ్డుకి చేర వేస్తున్నారు, ఎందుకో ఇంకెందుకు పొయ్యిలోకి కట్టెలకోసం, ఆళ్లు బండబడ, భయం లేదేం—లోనకి పోతూ ఉన్నారు.

ఆ నల్లటి కర్డీశరీరంమనుషులు దూలాలు ఒడ్డుకి చేరెయ్యడంలో, కూడబలుక్కున్నట్లు, కొంత లయతో కలిసి పనిచెయ్యడం చూసి, అలిమేలు నదిగొడవ మరిచిపోయింది. బలమైన జబ్బలు, పిక్కలు, కండలు తిరిగి, కదలడంలో లయక్రమం చూసి విస్తుపోయింది. చూడ్డానికి బాగుంది. వాళ్ల మొహాలు ఎల్లా గుంటేనేం శరీరం అంతా బాగుంటుందా—అవన్నీ ఎముకలా, కండలా — కాల్చి వొంచిన గునపాలా, బిందె, ఎత్తి, దించి, తన చేతుల కండలకేసి చూసుకుంది. తన వల్లా లేవు ఆళ్లు మొగాళ్లు—మోటగా ఉంటారు మోటతనం తనకు లేదుగా, అందుకని అదంటె యిష్టం. మరి వెంకన్న అల్లా లేడేం! ఏమో, ఆడు కష్టపడి పనిచేస్తుంటే తను చూడలేదు ఈమారు చూడాలి చ, ఛ—ఆడి గొడవొద్దు. ఇంకా అమ్మ రాలేదేం చెప్మా వెనక్కి తిరిగి చూసింది. దూరంగా జనం పరుగులెడుతున్నారు, కందిరీగలల్లే—కందిరీగ కుట్టినవాళ్లకి మల్లే—

మరో రెండడుగులు ముందుకేసింది అలిమేలు. "అటెళ్లమోక, చస్తావు— కొంపకెళ్ళు" అని అరిచాడు, వల్లశరీరంమనుషులలో వొకడు.

"ఏం ?"

"కళ్లులా—కబోదివా ? నీ రొస్తావుంది. లగెత్తు. పోవేం."

కసిరాడు నల్లటయ్య తనకి భయంగా లేదు అక్కడ కూర్చుని, ఆ నది రొదవింటూ, నురుగు విరిగే గమ్మత్తు చూస్తూ, ఆ నల్లటోళ్ల పిక్కల చమత్కారం చూస్తూవుండాలనిపిస్తుంది

వాళ్లు మళ్లా కసిరారు

ఇంటికేసి బైలు దేరింది అలిమేలు, వొక్కసారి గంగమ్మతల్లికి నమస్కరించి ఆ త్రోవమ్మట రోజూ అంత రద్దీ ఉండదు— ఊరికి మూడు మైళ్ల దూరంగా ఉండటం మూలాన. ఆ సాయంత్రం అందరు జనం, బళ్ళు, సైకిళ్లు, కార్లు పోవడం చూస్తూ, తనూ వేగంగా నడవడం సాగించింది దోవ తొలిగి, అడ్డగాళ్లల్లో పడి గంటలు మోగుతూ ఎడ్లబండ్లు పోటీలమీద పోతున్నాయి అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పడానికి ఎవరూ నిలబడరు ఏమిటి చెప్మా! ఇదంతా నదిలో నీటికి భయపడే వెనక్కి తిరిగిచూసింది. ఎన్నడూ చూడని దృశ్యం చూసింది,—నీళ్ళు నది వొడ్డు మట్టంకి సమంగా, అక్కడక్కడ వొడ్లు పొర్లిపోవడం—తనెప్పుడూ చూడలేదు

"ఇదిగో—ఏమిటబ్బాయ్—ఎక్కడికి పోతావున్నారు ?" అని కేక పెట్టింది.

ఆ కుఱ్ఱాడు పరుగెడుతున్నాడు.

"నది గండి పడిందంట—అంతా కొట్టుకు పోతుందట ...."

ఒక్కసారి వూపిరి నిల్చినట్లయింది. అంతా కొట్టుకు పోవడమే అలిమేలికి నవ్వొచ్చింది. అరుగో ఆ ముష్టోళ్ళు—నిదానంగా చెట్టుకింద చిదగులు పోగుచేసుకుంటున్నారు. వాళ్లకి లేని భయం, వీళ్లందరికీ ఎందుకో. ఇంతకీ అమ్మేదీ ? పొద్దుపోయినా రాదేం ? నది పొంగుతూందని అటకాయించారా ? వెంకటేశ్వర్లు ఎంటుండంగా అమ్మకేం భయం ? ఆళ్లనీ ఈళ్లనీ అడుగుతుంది కాని, వెంకటేశ్వర్లుని అడగదేం—అదే, తన పెళ్లి విషయం ? ఆడికి—వెంకటేశ్వర్లుకి వోమారు పెండ్లయిందంట, మరే మొచ్చిందో, దాన్ని ఇడిచేసినాడుట. ఆ ఇడిచేసిన దాన్ని చూడాలనుంది తనకి. తనకంటె ఎరుపా ? బావుంటుందా ? చూసి బుజాన చెయ్యేసి 'అయ్యో పాపం' అని, తర్వాత, గట్టిగా లెంప పగలెయ్యాలనుంది ఎందుకో. తన కెందుకో, ఇష్టం ఉన్నవాళ్లని సముదాయించి, బుజ్జగించి, ఆపైన లెంప

పగలెయ్యాలనుంటుంది, అదేం చిత్రమో. తనని చేసుకుంటే, మరొకతి వచ్చితే తనని ఇడిచేస్తాడు వెంకటేశ్వర్లు—అదీ అమ్మ భయం. మరే, తనంత లొక్కా? తాను చేసుకోకేం. 'చేసుకోను' అన్నాడంటె, ఆడి చెంప పగలదూ! చేసుకుని ఇడిచేస్తే, చంపెయ్యనూ? తన మనస్సు ఎలాంటిదో అమ్మకి తెలియదు. ఆ మధ్య సూపరెంటు సూరయ్యగారింట్లో పనికి కుదుర్చుకోమని, ఆరే కబురంపితే, అమ్మ వొల్లకాదంది. సూరయ్యగారబ్బాయి—శివుడంట—పోకిరబ్బాయంట. అవుతే—తనకి ఆరింట్లో పని కుదరాలనుంది, ఆ పోకిరితనం ఏమిటో చూద్దామని. శివయ్య భలే ఆయన. భలే బట్ట లేసుకుంటాడు. ఎగదువ్వ క్రాపింగు, వాచి, కళ్లజోడు, ముస్తాబుగా ఉంటాడు. ఏమన్నా చేస్తే చెంప పగలేసి సర్దా తీర్చుకోవాలనుంది. కాని అమ్మ వొప్పదు.

కారు హారన్ మోతకి అదిరిపడింది అలిమేలు. నిలబడి తేరబారి చూసింది. కార్లోంచి దిగింది శివయ్య—ఆయనే—సూపరెంటు సూరయ్యగారబ్బాయి. అదేమిటి అమ్మని చెయ్యి వూపుతున్నాడు! అలుముకుంటూన్న చీకటిలో తనకి ఆశ్చర్యంగా ఉంది. ఏం చేస్తా డేమిటి. వెళ్లింది.

"ఇదుగో—కారు తోస్తా?"

తలపంకించింది.

"ఏమిటి తోస్తావా తొయ్యవా?"

"ఎందుకు?"

"చెడిపోయింది."

"నిన్నే"

దగ్గరగా వొచ్చాడు సదాశివరావు— జేబు రుమాలుతో మొహం తుడుచుగుంటూ. గుప్పున పరిమళం కమ్మేసింది.

వింత వాసన.

"ఎక్కడికి?"

"అదుగో మా యింటికి—ఎరగవు? ఆ కొండమీద రెండు ఫర్లాంగులు"

"నాచేత కాదు."

"ఇంతేనా—అంత ఎత్తుగా లావుగా ఉన్నావు."

కారు వెనక మరో ఇద్దరు మనుషు లున్నారు.

"రా, రా—వో చెయ్యి వెయ్యి" అని వాళ్ళ తొందర చేస్తున్నారు. "ఊ" అని సదాశివరావు, ఆమె చెయ్యి పట్టుకు లాగాడు. అతని అరిచేతి చెమట తన చేతికి తగిలి చీకాకు పడింది. చేతినిండా మట్టి— తనూ వెనక్కి వెళ్లి, కారుని తొయ్యడం సాగించింది. శివయ్య లోపలి కెక్కాడు.

"అక్కడ కాదు, ఇక్కడ"

తనని పక్కకి వచ్చి తొయ్యమంటున్నాడు.

వందగజా లొచ్చేశారు. అక్కడ నుండి ఎత్తు ప్రారంభం.

"ఇక్కడ" అని ఆమె చెయ్యి పుచ్చుకుని, ముందుకి లాగాడు శివయ్య. తన బుజాన పడింది చెయ్యి. ఎల్లాగో ఉంది. లేకుంటే యీపాటికి చెంప పగలెయ్యదూ?

ముందు అలుపు ప్రక్కన తోస్తోంది. కాళ్లకింద మట్టి, అక్కడక్కడ కంకరరాళ్ళు, పాదాలను కోసేస్తున్నాయి ఆయాసంతో ఒగర్పు పైకి కనపడకుండా బిగపెడుతోంది కాని ప్రయోజనం లేదు—బిగపెట్టిన వూపిరి విడిచేసినప్పుడు, ఏదో ధ్వని కూడా వస్తోంది కంఠంలోంచి. 'అంత ఎత్తుగా, లావుగా ఉన్నావు' అని వెక్కిరించాడు. తను లావా? ఆ మాట పీకుతోంది. ఎంత సన్నటి నడుం తనది—నాజూకైన వక్షం, నునుపైన బుజాలు—తను లావా—చీరలో లావుగా ఉంటాను కాబోలు—ముతకచీర, పాతది—చుట్టి చుట్టి బొడ్డుకాడ బిగించింది——మరి బొడ్డుకింద కాస్తంత ఎత్తుగా ఉంది నిజమే. అదంతే—అమ్మకీ అంతే. అందరికీ అంతే. అసలీ మొగాళ్లకి తెలవదు. ఇంటికెళ్లి చూసుకోవాల—లావో కాదో. ఆయాసంతో రొప్పుతోంది—నీటిమీద నూదంటిగాలి పాడుస్తున్నా, చెమటల్లు పట్టేస్తున్నాయి. చెమటంటే తనకి గిట్టదు. ఎండపాటేల కూడా, స్నానం చేస్తుంది. ఏసంగిలో నాలుగు దఫాలు—చెమటంటే రోత. కాని ఈ అలుపు చెమటకి వాసన లేదు అదేంటో; విడిచి పమిటతో మొహం, మో చేతులు తుడుచుకుంది.

"ఇంతేనా—ఐపోయింది?" అన్నాడు సదాశివరావు. పళ్లికిలించి నవ్వుతున్నాడు. తెల్లగా ఉన్నాయి పళ్ళు—కండ్లజోడు బాగుండలేదు. అదేదో దయ్యంలా గుండాడు. చెయ్యి వెయ్యబోతుంటే తొలిగినట్లు మరో అడుగు వెనక్కి వేసింది.

"ఇంకెంత, మరో వంద గజాలు."

అలిమేలు నిలబడింది. ఆమెతోబాటు, వెనక తోస్తున్న మనుషులు కూడా నిలిచిపొయ్యారు. రాళ్లమీద కూర్చున్నారు. తనూ దూరంగా వెళ్లి కూర్చుంది. తలని మోకాళ్లమీద ఆనించింది. నక్షత్రాలు మెరుస్తున్నాయి. కీచురాళ్లధ్వని పైన నక్షత్రాలదగ్గర నుండి వస్తున్నట్లుగా ఉంది. జనం అలజడి లేదు. నిశ్శబ్దంగా ఉంది. అలసట తీర్చుకోడంతో అలిమేలు పంచ ప్రాణాలు కుదుటపడి మనస్సు నిర్మలంగా ఉన్న ట్లనిపించింది. ఆ క్షణంలో—ఎవ్వరి ప్రమేయమూ పట్టలేదు—తనూ తానుగా ఎరుగున్నట్లు, తనలో 'తన తనం' గుప్పట్లో బిగించి చూసుకుని, వోదార్చి, బుజ్జగించి, చివరికి ఫెడీలున లెంపమీద కొట్టినట్లయింది. శివయ్య సిగరెట్టు ముట్టించాడు. హారనేశాడు. ఇద్దరు మనుషులు లేచి తొయ్యడం మొదలెట్టారు.

"ఊ—కానీండి—ఒచ్చేశాం" అన్నాడు శివయ్య.

తనూ లేచింది. తొయ్యడం మొదలెట్టింది. పాదాలకింద గులకరాళ్ళ చక్కిలిగింతలు పెడుతూ ధ్వనిస్తున్నాయి. గాలి జోరైంది—చిరు వెంద్రుకలు, జెడ కొప్పులోంచి విడి, మొహాన్ని కప్పుతుంటే ఒకచేత్తో తొలిగిస్తూ, మరొక దానితో తోస్తూంది.

"ఇంతేనా—? అలుపొచ్చిందేం"

అంటున్నాడు శివయ్య. ఆమెలో ఒక ఆవేశం వొచ్చింది. ఎందుకు తొయ్యలేదు—తనొక్కత్తె తొయ్యగలదు, పట్టింపుకొస్తే. బలాన్ని పూరించుగుని ఒక ఉద్వేగంతో అవయవాలకి వేరే ప్రత్యేకంగా రోషమొచ్చి తిరగబడినట్లు తన శక్తంతా యీ కాస్త పనికోసమూ ధారవోసినట్లు, ఏదో పూనకం ఒచ్చినట్లు తోసుకుంటూ పోతోంది. జడ వూడిపోయింది బొడ్డుకింద కుచ్చెళ్లు విడిపోతున్నాయి. కొంగు రొమ్ముని విడిచేసి తెరచాపలాలేచి వెనక్కి తోసేస్తున్నది ఆమె గమనించలేదు. తన రక్తం, మాంసం, ఎముకలు పరాయి సొమ్మైనట్లు—తనకి చెందనట్లు, తనొక యంత్రంగా దేన్నో, ఎందుకో, ఎక్కడకో లాక్కెళ్లడమే లక్ష్యం కానట్లు తోసేస్తోంది.

"ఒచ్చేశాం—మరో ఇరవై గజాలు కూడా లేదు. నేనూ వస్తున్నా."

అని సదాశివరావు, సిగరెట్టు పారేసి, కార్లోంచి దిగి, ఆమె వెనకగా నిలబడి తొయ్యడం మొదలెట్టాడు. అతను తగలకుండా, తాను కొంచెం ముందుగా వెళ్లి తోస్తోంది. తన ఆయాసం, ఒగర్పు అంతా బాగా వింటాడు, ఎట్లా?

'అమ్మో' మని పెద్ద కేకతో కింద పడింది అలిమేలు. కాలు మడత పడింది. రెండు జబ్బలూ పుచ్చుగుని ఆమెని లేవదీశాడు శివయ్య. జబ్బలు దులుపుకొని, రెండోవైపుకి వెళ్లింది సిగ్గేసింది. తను వోడిపోయింది.

"దెబ్బ తగిలిందా?"

లేదన్నట్లు, వినిపించుకోనట్లు కారు తోస్తోంది అలిమేలు ఆమె తోస్తున్నవేపు కొచ్చాడు శివయ్య. అదేమిటి అట్లా మీదిమీది కొస్తాడు అట్లా రావడం ఇష్టమే నని అనిలిమేలు వొప్పుకోలేక పోవడం, నవ్వుగా ఉంటుంది. కానప్పుడు నవ్వే వోపిగ లేదు—ఏడ్చేటందుకూ వోపిగలేదు.

"ఇంద"

శివయ్య ఒకనోటు పైకి తీశాడు.

ఏరకం నోటో ఆమెకి కనబడ్డంలేదు.

"తీసుకో."

తీసుకుంది. తీసుకుంటే తప్పేమిటి—కష్టానికి కూలి. ఏమునాలో తెలీదు. నవ్వుతే అతనికి చీకట్లో కనబడదు. ఆకాశాన ఇంకా మబ్బులే—కాస్త తెరిపియ్య కూడదు? దగ్గరగా తన నవ్వు చూసునుగా.

ఎనకాల తోస్తున్నవాళ్లకి కూడా చెరో నోటూ యిచ్చాడు. వాళ్ళూ తీసుకున్నారు, తనలాగే తప్పులేదు. అమ్మ కిస్తుంది. అమ్మేది? ఇంటికాడ కూడొండాలి—వెళ్ళాలి— వెళ్లింది అలిమేలు.

"ఇదిగో నిన్నే"

వెనక నుండి శివయ్య కేకేస్తున్నాడు.

వినిపించుకోకుండా తనింటికేసి పరుగెట్టడం మొదలెట్టింది అలిమేలు. పరుగు నిల్చింది. బలం అంతా అయిపోయింది. ఒక్కొక్క అడుగే మెల్లగా వేస్తూ ఇంటికేసి నడుస్తోంది. ఎవ్వరూ జనం లేరు. కారు గెంటిన వాళ్ళ కొండ అవతలవైపు నుండి వెళ్ళినారు కాబోలు. అక్కడ ఆ రాళ్ల మధ్య పడిపోయి, నక్షత్రాల కేసి చూస్తూ ప్రాణం విడిచెయ్యాలనుంది అలిమేలుకి. కాని అమ్మో, పాణం ఇడిచెయ్యడమే. తనంటే తనకి అంత ఇష్టం. ఇష్టం గలదాన్ని చెంప పగలెయ్యాలిగా మరి—అందుకని తన బుజాన్ని ఎడం చేత్తో గట్టిగా చరుచుకుని, నడవడం సాగించి, పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంది అలిమేలు.

మబ్బు పెద్దదై అంతవరకు మినుకు మినుకు మంటున్న పది పన్నెండు నక్షత్రాలు కూడా కనపడడం లేదు. చీకటివలలో చిక్కుకున్న చేపలా, నలుదిక్కులా భయంతో చూస్తూ యింటికి చేరుకుంది. నోటు విషయం అమ్మకి చెప్పకూడదు.—కూకలేస్తుంది. చెప్తే మాత్రం ఏం ? తనేం తప్పుచేసింది ? పనిచేసి కూలి సంపాదించింది. అమ్మ మాత్రం ఆపని చెయ్యడంలా—ధాన్యం దంపుళ్ల కెడుతుంది, మిషను కుట్లు కుడుతుంది. ఊళ్లోవాళ్ల ఊరగాయలకి అమ్మ చెయ్యి చేసుకోవాలి. ఎవ్వరూ జనం కనబడరేం ? దూరంగా చెట్లకింద ముష్టివాళ్ల వెలిగించిన మంట ఆరిపోతూంది—పిలిచింది ఎవరన్నా పలుకుతారేమోనని. అమ్మని కేకేసింది. ఇల్లుదాటి ఫర్లాంగు ముందుకెళ్లి అమ్మని కేకేసింది. నది హోరు వెక్కిరించినట్లు, వెన్నుమీద చరిచినట్లు వినబడుతోంది.

ఇంట్లో కొచ్చింది. తనకి ఆయాసంగా ఉంది. ఆకలేస్తోంది. అగ్గిపుల్ల కోసం తడుముతోంది. బియ్యం పడెయ్యాలి. రొయ్యి పొడుండబ్బా చేతికి తగిలింది. దాని ప్రక్కనే అగ్గిపెట్టె పుల్లగీసి ఇలాయి బుడ్డి వెలిగించింది. అది అప్పుడే ఆరిపోయింది. మరో పుల్ల గీసి, లాంతరు ముట్టించింది. ఊపి చూసింది. కాస్త మిగిలిన కిరసనాయిలుతో రొకరొక లాడింది. తన కాకలేస్తోంది. ఉండబట్టలేక, రొయ్యి పొడుం తింది, వూగిసలాడే మంచం పట్టెమీద కూర్చుని. కిందినుంచి పరిగెత్తిన ఎలుకని చూసి ఉలిక్కిపడింది. ఇలాయిబుడ్డి తగిలించే చోట, గోడమీద నల్ల డాగులో కదుల్తున్న బల్లి నల్లగా ఉంది.

కళ్లు మూసింది అలిమేలు. తనొక్కత్తే ఉండడం వింతగా ఉంది. ఇంకెవరూ లేరు—తను, ఆ ఏడుకొండలవాడు—అంతే. తనమీద తనకి జాలి, భక్తి, విశ్వాసము కుదరడం వొక అనుభవం. పెట్టెమీది అద్దంముక్క చీరతో తుడిచి, లాంతరు దగ్గరగా లాక్కుని, అద్దంలో తన మొహం చూసుకుంది. ఎంత బాగుంది తాను. తను మొగాడైతే, అద్దంలో మనిషిని గట్టిగా ముద్దు పెట్టుకుని మరి వొదలదు. నిరుడు తిరణాల కెళ్లినప్పుడు, ఆ మొగాళ్ల మంద తనవెంట బడటం అమ్మ కూడా చూసింది. ఆలయంకాడ జనం వొత్తిడిలో ఆడెవడో పోకిరీ వోడు. ఎదురంగా పరుగున వొచ్చి రొమ్ముమీద ఢీకొన్నాడు. తనకి జ్ఞాపకం. ఆ నరయ్యొకడు. అమ్మ అందుకనే వాళ్లింటికి పోవొద్దంటుంది. ఆ నరయ్య వోపాలి, దూడలపాక దగ్గర, ముల్లు గుచ్చుకుని కింద పడబోయినట్లు తూలి నడుం గట్టిగా పట్టుకుని—ఓ యబ్బ—ఇక్కడ గిల్లేశాడు—మోట సచ్చినాడు. పమిట తొలిగించి తన స్థనాలు చూసుకుంది. నిండుగా, గుండ్రంగా మధ్య సూది పట్టేటంత యడం కూడా లేకుండా—తనని లావంటాడా—శివయ్య. శివయ్య పీల, రొయ్యిలా గుంటాడు—నవ్వుతో అద్దంలో నోరు వొంకరైంది.

పెద్ద చప్పుడుతో నదిలో నీళ్ల పొంగి, ఇంట్లో కొచ్చివేశాయి. గేద్దాడ మాయలా భ్రమించింది. కాదు—ఆ రొదేమిటి. అమ్మో తడి—ఇంట్లోకే నీళ్ల—దూరంగా గుమ్మంలోంచి చూసింది అంతా నీరే—నల్లగా, వలలా, మొసలి నోరు తెరుచుకున్నట్లుగా, కాళ్లని చుట్టేసింది. డబ్బాలు, గిన్నెలు, కుండలు, డిక్కిడిక్కిమని కొట్టుకుని ఎగురుతున్నాయి, తేలుతున్నాయి. తన పాదాలు మునిగి పోయినాయి. ఎలుకలు కిచకిచ మంటూ మంచంమీద పరుగులెడుతున్నాయి. మంచం పట్టెమీదకి పాకుతున్నాయి నీళ్ళ. అమ్మో, కొంప మునిగింది. కెవ్వున కేక పెట్టి, గుమ్మం కేసి గెంతి, కింద పడింది. లేచింది. లాంతరు బుజాన తగుల్చుకుని దొడ్డివైపు వైపు కొచ్చింది. అక్కడికీ వొచ్చేశాయి నీళ్ల. కొంప మునిగిందర్రో అని పెద్దగా అరిచింది. అమ్మని పిలిచింది. ఇరుగు పొరుగు వారి పేర్ను పిలిచింది. ఎవ్వరూ పలకరు., ఇదేమిటి యీ ఆపద—ఇంత ఉపద్రవమా—ఎక్కడికి పోవడం ? ఎటూ. "ఇటు", 'ఇక్కడికి' అన్నట్లుగా నీళ్ల, తుక్కు, దూగర, ఆకులలమ, కట్టెలు, బొగ్గులు, గుడ్డపీలికలు—అన్నీ నీళ్లలో కలిసి, తన మోకాళ్లని పీకేస్తున్నాయి. చలిగాలేదు. కాళ్లు కాల్తున్నట్లుయింది. నీటి వడిని ఎదుర్కుని ఇంటిలోపలి కెళ్లింది. ఉట్టి తాడుకి వేళ్లాడుతూన్న రవికని తీసుకుంది. అది పాతది—చినుగుది. ఉతుక్కి తీసి, తనకి పట్టడంలా. గట్టిగా బిగించి తొడుక్కుంది. జడలో పిన్ను తీసి, గుచ్చి, తడిసిన గుడ్డపీలికను పిండి, మెడ వెనక జారిన జెడని బిగించి కట్టింది. నీరు నడుం దాక వొచ్చేసింది. ఇది తమాషాలాగుందే. మంచం పక్కన నీటిమీద వెంకటేశ్వరస్వామిది—కర్రబొమ్మ ఆడుతోంది. దాన్ని తీసుకొని, పళ్లల్లో బిగించి, దొడ్డివైపు కొచ్చింది. చచ్చిపోతానా ? ఇంక ఆఖరే—వెంకటేశ్వరస్వామికి దయలేదా. తనని చంపేస్తాడా ? ఏం పాపం చేశానని అంత కోపం. చచ్చిపోవడం అంటే ఇదా—ఇంతేనా— కాసిని నీళ్ళ తాగి గుటుక్కు మనడమేనా ! తను చావదు. చావంటే అంత సుళువా—అంత ఎత్తయిన, లావైన శరీరం,—అంత జోరుగా కొట్టుగునే గుండెలు—గుండెమీద చెయ్యి వేసి చూసుకుంది. చేతి వేళ్ల ఆ వేగానికి అదిరిపోతున్నాయి. చప్పుడు వినవొస్తోంది—గుండెకాయ కంఠంలోకి చొరపడ్డట్లు. దొడ్డివైపు కొచ్చి నలుమూలలా చూసింది. అంతా నీరే,— మోకాళ్లదాకా వొచ్చేసింది. చీర పైకి లాగి, గోచీలా బిగించి వెనక్కి మడిచి కట్టింది. దొడ్లో రాక్షసిలా ఎదిగిపోయిన చింతచెట్టుంది. దానిమీద కెక్కితే తనకి బెంగలేదు. కాని ఎక్కడం ఎట్లా ? దాని మొదలు తనకంటే రెండింతలు ఎత్తునుంది. ఆపైకి వెడితే. పెద్ద కొమ్మలుగా చీలింది. ఆ కొమ్మలు కుర్చీ బల్లలా, ఏటవాలుగా ఉన్నాయి. ఇంటి చూరుకింద గోడలో, అక్కడక్కడ ఇటికలు వూడగా కంత లేర్పడి పాదానికి పట్టుగా ఏర్పడ్డం, యత్నించి చూసింది. నోట్లో చందనం బొమ్మ, భుజాన లాంతరు, రెండు చేతులతో పై ఇటుకలు పట్టుగుని, పాదాన్ని కంతలో ఆనించి, వొకడుగు పైకి వేసింది. కింద నీటి ప్రవాహం.

పైని నెత్తికి తగిలే చూరు. ఎట్లా పైకెళ్లడం? చూరులో పొడుంగా విడిపోతున్న రెల్లు, రెపరెపమని చిరిగిపోతూన్న తాటాకులు, ఆ మట్టలు చేతికి చిక్కాయి. కుడికాలు పైకి మడిచి, ఒక్క వూపుతో, చూరు పైకి చేరుకుంది. ఆయాసంతో, భయంతో చెమట్లు పోసేస్తున్నాయి. ఆ తాటాకులమీద, ఆ రెల్లు గడ్డిలో మొహం దాచుకుని, ఏడ్చేసింది అలిమేలు. తను బ్రతుకుతుంది—చావకూడదు. దేవుడు కటాక్షించాడు. కాని ఆ లాంతరొకటి. జారి పడితే గడ్డి అంటుకుంటుంది. అంటుకుంటే అంటుకోనీ—ఇంత నీళ్లుండంగా—కొంప తగులడితేనేం, మునిగితే నేం,—'అమ్మో' అని మరో పెద్ద కేక వేసింది—తను కిందికి జారిపోతోంది. ఆ తాటాకులలో, రెల్లులో పట్టు లేదు—ఏటవాలుగా, కిందికి జారిపోతోంది. మరో క్షణంలో కింద నీళ్లల్లో పడిపోను. లేచి కూర్చుని మోకాళ్లని, తాటాకులలోనికి జొనిపి, మెల్లగా లేచి నిలబడి, చేతికి అందీఅందకుండా అడుగు దూరంలో ఉన్న చింతచెట్టు కొమ్మని బలంగా పట్టుకుని, రెండు కాళ్లూ ఒక్కసారి పైకి ఎగరేసి, చెట్టు మ్రాను మధ్యలోకి గెంతిపడింది. కళ్లు గట్టిగా మూసుకుంది. చచ్చానా, బ్రదికానా ? పొట్టకింద గోకి చూసుకుంది. 'అమ్మో' మని మరో పెద్ద కేక వేసింది. వెన్నుమీద లాంతరు చిమ్ని చుర్రుమంది. చిత్రం ఆరిపోలేదు. చేతులు తనవే. కాళ్లు తనవే. చేతులకి ఒక్క గాజు లేదు—ఉన్న నాలుగూ గోడకి తగిలి విరిగిపొయ్యాయి కాబోసు. మెళ్లో గొలుసు లేదు. ఆ పెట్టెలో ఉండిపోయింది. నెత్తికి కట్టిన గుడ్డ తీసేసింది. జుట్టు విడిపోయి, గుబురుగా మెడవెనక్కిపడేసి, సరిచేసి, తడిని ఆరబెట్టేటట్లు, చేతులతో చప్పుడు చేస్తూ, జడని పాయకింద లాగి, మ్రామకింద సన్నగా లేచిన చిరుకొమ్మకి తాడులా బిగించి కట్టేసింది,

మరో పాయిని లాంతరుకి ముడేసింది వెన్ను మ్రానుమధ్యగా ఆనించి, కాళ్ళు మరో కొమ్మకి తగిల్చి, ఆకాశంలోకి చూసింది అలిమేలు అది ఆకాశం కాదు—తను పడిపోకుండా పైన కాసుకొని చూస్తున్న వొక శక్తి, వొక వింత—తనెన్నడూ ఎరగని అనుభవం. తన పేరు, ఊరు, అమ్మ, కొంప, వెనక, ముందు, డబ్బు దసకం, తిండి తిప్పలు—ఇవన్నీ మరిచిపోయి, కేవలం కండలో ఎముకలో సజీవంగా, ఊపిరి పీల్చి, ఉండడమే, ఆ వింత అనుభవం నరాలు, గుండెలు, రక్తం, శరీరంలో ప్రతి అణువు, నోరిప్పి పలకరించినట్లు, కన్నులాగై తనలోనికి చూస్తున్నట్లు, నోళ్ళయి తనని తాకి, ముద్దెట్టుకొన్నట్లు—తను తనలా కాక, మరొకరిలాగ, ఆ మరొకరు తనుగా అయిపోయి, తన్ను తాను కౌగలించుకొని, ఆనందంతో ఒక్క పెట్టున ఏడవడం ఆ వింత

కొమ్మమీద జార్లబడి కళ్ళు మూసుకుంది అలిమేలు కళ్ళు మూసుకున్నా, తెరుచుకొన్నా ఒకలాగే ఉంది రెప్పలకింద కెరటాలు, రంగురంగులవి ఇసుకని కోసినట్లు కవ్వించి, చక్రాల కింద వొకదాని వెనక వొకటి పెద్ద వక్రంగా మారుతూ చంద్రుడుగా, సూర్యుడుగా, కోటి రంగుల సముద్రంగా పైకి లేచి ఆకాశంలో అంతర్ధానమైపోతున్నట్లు ఆలోచన లేదు—అమ్మని గురించి ఊహ లేదు. ఆకలి లేదు—సజీవమై ఉండి కూడా నిర్జీవంగా మిగిలిపోవడంలాగుంది

అది కల కాదు—కింద నీళ్ళు, కాలు జాచితే అందేటంత పైకొచ్చాయి చెట్టు మొదలు కనబడడం లేదు ఇంకా పైకొస్తే, ఎక్కడి కెక్కడం—ఆ కొమ్మ చదునుగా, తిన్నగా ఉంది—పైకి ఎక్కేటందుకు పట్టు దొరకదు కిందంతా నీరు—పైన మబ్బు మూసినదుప్పటిలా ముడతలు పడి, ఆకాశాన్ని నీటిమయంగా చేసేసినట్లుంది కింద, పైనా అంతా వొకటే—తేడా లేదు. నిశ్శబ్దంగా ఉన్నా, మరణానికి ముందు రోదించినట్లు వోపికలేని మేఘాలు ఢీకొని అయిష్టంగా ఉరిమినట్లు, నది నీళ్ళు పల్లంలోకి జారిపోతూ సిగ్గుతో మొహాన గుడ్డ కప్పుకుని కింద రత్నాలని, మణిమాణిక్యాలని చీపురుతో తుడిచేసినట్లు — తనకోసం, తనపైకి — కడసారి త్యాగాన్ని వోరు విప్పి అడిగినట్లు ధ్వనిస్తూ పొంగి, పొరలి విచ్చలవిడిగా విర్రవీగి పొగారిపోతూవుంది

గుండె దడ తగ్గింది—తనకి తెలీని మార్పుతో శరీరం స్థిమితపడుతోంది. చావడానికి తగినంత ధైర్యం చిక్కింది అమ్మ లేనిది తను బ్రతికి ఏం ప్రయోజనం ఒక్క క్షణం, వూపిరి బిగపెట్టి, రెండడుగులు దిగితే, అయిపోతుంది

అమ్మో—ఎందుకు చావాలి ? అమ్మకేం—ఏ లోగిలిలోనో నిక్షేపల్లా ఉంటుంది. చిన్నప్పటినుండి తనెరుగున్న శరీరాన్ని—పాపం గంగపాలు చెయ్యడమా. అదేం చేసిందని ?

కెవ్వున కేక పెడుతున్నా రెవరో—అదిరిపోయింది అలిమేలు మళ్ళా గుండెదడ ప్రారంభమైంది అదిరిపాటులో లాంతరు కొమ్మకి తగిలి, ఆలో లక్షణా అన్న చప్పుడుతో టప్పుమంది చిమ్మ చీకటేసింది—

ఎవరిదో కేక పెద్దదైంది మూలుగు, రొద కాపాడమని—అయ్యో, బాబోమని—అరుపు అది మొగాడి కంఠం నిలబడి నాలుగు దిక్కులా చూసింది. ఒక కంప తన చెట్టు వెంపుకు కొట్టుకొని వస్తోంది అందులోంచి ఎవరో చేతులు పైకెత్తి మొరెట్టు గుంటున్నారు దగ్గర కొచ్చేసింది. రెండు చేతులతో కొమ్మని గట్టిగా పట్టుకొని, కాళ్ళు కిందికి నీళ్ళు తాకేటట్లు చాచింది కొట్టుకుపోతోన్న కంపలోంచి పైకి కనబడుతోన్న ఆ చెయ్యి ఆమె పాదాలని గట్టిగా పట్టుకుంది చాలా బరువు కొమ్మని తన పట్టు నిలవడంలేదు—జారిపోతోంది

ఆమె మోకాళ్ళు పట్టుగుని మ్రానుమీద ఒక కాలుంచి, ఆ వ్యక్తి కొమ్మ మొగలో ఆమె ప్రక్కనే కూలబడిపొయ్యాడు

“గట్టిగా పట్టుకో వొదలకు ” అని వొగరుస్తూ సదాశివరావు ఆమె నడుం గట్టిగా పట్టుగున్నాడు నీళ్ళ నోట్లోంచి బైటికి వొచ్చేస్తున్నాయి

“కాసేపుంటే చచ్చేవాడినే ..”

‘హయ్యో’ అని ఆయాసంతో హైరాణ పడుతున్నాడు.

“మీరా ?” అంది అలిమేలు తెల్లబోయి

“నేనేమిటి, నువ్వేమిటి చస్తూంటే ”

“మెదలకుండా వుండండి—ఇదుగో ఈ కొమ్మకి కాలు ఆనించండి—ఆ—అల్లాగ—ఆవైపు కొమ్మని నడుం ఆనింది పట్టుకోండి—మాట్లాడకండి” అంది అలిమేలు, నడుం పైనుండి అతని చేతులు తొలిగిస్తూ అతని దవడలు, అంకెళ్ళు తడికీ, చలికీ నొక్కుకుపోయి మాట్లాడలేకపోతున్నా, ఏదో చెప్పాలని, బిగ్గరగా ధ్వనులు చేస్తూ, యత్నం చేస్తున్నాడు

“ఆఖరికి నువ్వే దిక్కయ్యావు ”

డ్రైవర్ ఉడాయించాడు—నౌకర్లు లగెత్తారు—చివరికి—అది—సువర్ణ కూడా—ముందే తెలుసుకుంది కాబోలు,—ఈ నది గండి పడి వుపద్రవం జరుగుతుందని—ఎప్పు డెళ్ళిపోయిందో—ఐపులేదు నేను—నేను ”

అలిమేలు ఆశ్చర్యంతో చూస్తోంది కళ్ళు పూర్తిగా తెరచుకుని—మొహం అంతా ఒక కన్నైనట్లు

“మాట్లాడకండి ”

“మాట్లాడకపోతే చచ్చిపోనూ, భయంతో మాట్లాడి తీరాలి—ఇంకా బిగ్గరగా మాట్లాడతాను నేను, నాలుగింటికి క్లబ్బు కెళ్ళాను. చీట్లాట అంటే పేకాట రమ్మి అంటారులే—నీకు తెలీదు ఇరవై కాజేశారు మరో గంటుంటే అదంతా రాబడుదును ఈ లోగా టెలిఫోన్లు మోగాయి,—నీళ్ళొచ్చేస్తున్నాయని కార్లో ఇంటికి బైలుదేరాను కాస్త దూరంలో కారు చెడింది—వాళ్ళనీ, వీళ్ళనీ పోగుచేసి కారుని కొండ పైకి జేరేశాను ఇంట్లో ఎవ్వరూ లేరు అవి ఇవి సర్ది, డబ్బు పర్సులో పడేసి కారు రిపేరు పూర్తిచేసి బైట కొచ్చేటప్పటికి, అప్పుడే నీళ్ళ కిటికీ దాకా వొచ్చేశాయి కార్లో కూర్చున్నా—గరాజ్ తలుపు లూడి తేల్తున్నాయి గట్టి కర్ర—మందంగా ఉన్నాయి తాళ్ళతో రెండు తలుపులనీ ఒకటిగా కట్టి—వాటిమీదకు గెంతాను నువ్వేకదూ—కారు తోసింది—ఎట్లా చూస్తావేం ?”

ఎవర్నో అన్నట్లు, వెనక్కితిరిగి చూసింది అలిమేలు తననే అంటూంట ఏమనాలి ? ఏమీ మాట్లాడలేదు కండ్లకి జోడు లేదు కళ్ళు చిన్నవిగా, లోపలగా ఉన్నట్లున్నాయి క్రాపింగు నుదుటిమీద పడింది—చొక్కా తడిసింది నెత్తిన కప్పిన తువ్వాలు తీసి నడుంకి బిగించాడు ఆ తువ్వాలు తన కిమ్మని సంజ్ఞ చేసింది ఇచ్చాడు బాగా పిండింది. నీళ్ళ వొదిలేటట్లు కొమ్మలకేసికొట్టి అతనిచేతి కందిచ్చింది

“ఏం—అప్పుడు—చూస్తూ చూస్తుండగా, నీళ్ళల్లో తేలిపోతూ, కిందికి పడవలా జారుతూ వొచ్చేశాయి. ఏదో కంపకో, రుప్పకో తగులుకుని నిలిచిపోయింది ఇరుక్కుపోయింది అప్పుడు మొదలెట్టింది భయం.

.అన్నీ ముళ్ళు కదుపుదామంటే ఆ కంపనే పట్టుకు కూర్చోవాలి. కేకలెట్టాను అందులో ఏ పామో కరిస్తే—చస్తాను అరుపులు, ఏడుపులు”

“నాలాగ భగమంతుణ్ణి తల్చుకోలేక పొయ్యారూ ?”

“చావు రాసుంటే భగవంతుడు కూడా తప్పించలేడుగా ప్రాణం రక్షించుకొనే సమయంలో నా కెవ్వరూ జ్ఞాపకం రాలేదు—ఆవిడ, నాన్న, అమ్మ, నౌకర్లు—నాకు నేనే—ఆలోచన లేదు—బుర్ర లేదు— ఊ భయం, ఏడుపు, అనుకో అమ్మో—చచ్చాను ”

అని మోచెయ్యి పట్టుగుని బాధపడుతున్నాడు సదాశివం

“ఏమిటది ?”

“ముళ్ళు—అన్నీ ముళ్ళే—చస్తాను ” అలిమేలు రవికకి బిగించిన పిన్ను —కాస్త పక్కగా తిరిగి, బైటకి తీసి అతని మోచెయ్యి దగ్గరగా లాక్కుని, ముల్లుని కెలుకుతోంది ‘బాబోయ్’, ‘అమ్మోయ్’ అంటూనే ఉన్నాడు అతను మెల్లగా బైటకి లాగింది చీకిపోయిన ముల్లుని

“వొద్దు—ఆ బాధ కంటె ఈ బాధ ఎక్కువగా ఉంది—వొద్దు ”

“ఫరవాలేదు ”

“ఇదుగో ” భుజం చూపించాడు— చొక్కా మెడ కిందికి తోసి, బుజాన ఉన్న ముల్లు కోసం వేళ్ళతో తడుముతోంది అలిమేలు. దొరికింది

పిన్నుతో కెలికుతోంది అతను పెద్ద కేకపెట్టి ఆమెమీద వొరిగిపోయి గట్టిగా నడుం బిగించి పట్టుకున్నాడు ఆమె స్తనాలు అతని వక్షం ఎడమ భాగానికి తగుల్తున్నాయి—తడిగా, వేడిగా అల్లాగే ఉండిపొయ్యాడు

కదలడేమిటి ? బుజం పట్టుకుని వూపి దూరంగా కూర్చోపెట్టింది.

''వొదలకు—నన్నొదలకు—వొదిలావంటే చస్తాను భయంగా ఉంది.'' అని మళ్ళా ఆమెని గట్టిగా పట్టుకుని, చేతులతో ఆమె శరీరాన్ని నిమురుతూ, దేనికోసమో వెదుకుతున్నట్లు ప్రతి అవయవాన్నీ స్పృశిస్తున్నాడు. ఆమె కిదంతా వింతగా ఉంది, ఎల్లాగో ఉందబ్బా చక్కలిగింతగా ఉంది—ఇదేమిటీ, పొయ్యేకాలం—ఇట్లా చేస్తాడు ?

అతని క్రాపింగ్‌కి, బట్టలకి ఏదో బురద—మడ్డి— తనకి రాసేస్తున్నాడు. నుదురు స్తనాల మధ్యగా ఆనించి పాడుస్తా దేమిటి ? పెదవులతో చర్మం పట్టుకుంటున్నాడు—ఇదేం మనిషి—రోతగా ఉంది తనకి తెలీకుండా అతని తలలో వేళ్ళుపెట్టి తడుముతూ, మడ్డిని తొలగిస్తోంది. ఇంకా గట్టిగా నడుం బిగించివేస్తున్నాడు—అబ్బ—ఎంత బరువో మొగాడు! తోసేస్తే కింద నీళ్లలో పడతాడు ఇద్దరూ పడతారు ఎట్లా జుట్టు వేళ్లల్లో బిగించి, తల పైకెత్తింది అమ్మో అంటూ లేచాడు—కళ్లు తెరవడు—మైకంలో ఉన్నాడా ? తాగాడా ? చస్తాడా ఏమిటి ? తను చంపేసిందంటారా ఏమిటి కర్మ—ఏమిటి చెయ్యడం ? చుట్టూ చూసింది. అన్ని వైపులా గుడగుడమని ప్రవహిస్తూ నీళ్ల ఆకాశంలో శవంపై కప్పిన గుడ్డలా మబ్బులు అమ్మో, బొడ్డుపైన వళ్ల తగుల్తున్నాయి జుట్టట్టుగుని తలపైకి లేవదీసి గట్టిగా లెంపకాయ కొట్టింది—పూనకంవోళ్లని కొట్టడం తను చూసింది

కళ్లు తెరిచాడు తేరిబారి చూశాడు

''నువ్వు, నువ్వా కొట్టింది ? నువ్వే ?''

''తెలివిగా వున్నారో లేరో నని ''

నవ్వింది అలిమేలు

''నాకేం తెలీదు భయంగా ఉంది మనిషి కావాలి నువ్వు కావాలి సీవొళ్లు భలే వేడి—నిప్పులా—చలిమంటలా—మెత్తగా, గట్టిగా రబ్బరు బంతిలా .''

ఇంకా చెబుతూండగానే రెండో లెంపమీద మరో దెబ్బ వేసింది.

'అబ్బ !' అని అదిరిపడ్డాడు

అతనికి కోపం వచ్చేసింది

''ఎందు కట్లా కొట్టావు—''

''మెలుకువగా ఉన్నారేమోనని ''

''ఛ, ఛ—కొడతావూ—తోసేస్తే నీళ్లలో పడి చస్తావు''

''నాకేం భయంలేదు—మీకే భయం నే నీళ్లలో పడితే, మీరు ఒంటరిగా ఉండగలరూ—నా వెనకే దూకుతారు ''

''నిజమే—వొంటిగా ఉండలేను—''

అని మళ్ళా ఆమె వక్షంలో మొహం దాచి, శరీరం స్పృశిస్తూ, గట్టిగా కౌగలించుకున్నాడు

''వొదలద్దు—నీ కేది కావాలంటే అదిస్తా—మేడా—కారా—నగలా—నీ వొళ్ళు ఎంత బాగుందో నువ్వెరగవులే—వొక పెద్ద శిధిలమైన కోట మధ్యలో తలదాచుకున్నట్లుంది. నీ చేతులు, కాళ్ళు ప్రాకారాళ్లు. నీ రొమ్ములు కత్తులు—నీ జుట్టు వల. నీ కళ్లు, శత్రువుల జాడ తెలుసుకునేందుకు కోట గోడలో కంతలు—''

''ఇయ్యేం పనులు—మంచి బుద్దులే ''

అని దూరంగా జరిగి పట్టు వొదిలించుకోవాలని పెనుగులాడుతూంది అలిమేలు

జుట్టు పీకింది మొట్టికాయలు మొట్టింది—

'బాబోయ్' అని లేచాడు—

చేతికి తగిలిన చందనపు బొమ్మ పైకి లాగాడు.

''బుగ్గకి పొడుచుకుంది—నీ మొల్లోది—ఇదేమిటి ?''

''ఎంకటేశ్వరసామి బొమ్మ—మొల్లో దాచా—బాగా అయింది—మరి లేకుంటే అయ్యేం పోకడలు ?''

బొమ్మ లాక్కుంది

''ఎందుకా బొమ్మ ?''

''ఉండాలి. దేవుడు ''

సదాశివరావు బిగ్గరగా నవ్వుతున్నాడు. మూఢభక్తి కాబోలు కాని నవ్వు క్షణంలో నిల్చిపోయింది నీళ్ళ 'కసక' మంటూ పాదాలకి తగిలేటంత పైగా వొచ్చేశాయి పెద్ద కేకతో ఆమెను గట్టిగా పట్టుకున్నాడు.

''అమ్మో'' అంది అలిమేలు

''ఇంక చావడమే. నీళ్ల పైకొచ్చేస్తున్నాయి ఎట్లా ?''

బిక్కమొగం పెట్టి ఏడుస్తోంది. చెట్టుపైకి చూశారు పైకొమ్మ అయిదారు అడుగుల దాకా, సాఫీగా, తిన్నగా—ఎక్కడా పట్టు లేకుండా పైకి లేచి ఆపైన వొంకర తిరిగి సన్నగా ఒంగిపోయింది ఆ ఐదారడుగులూ పైకి వెళ్లడం ఎట్లా ?

ఒకరి మొహాలు వొకరు చూసుకున్నారు మేఘాలు కూడా తలలు కొట్టుకుని ఏడుస్తున్నట్లు, ఒకసారి గర్జించి—బురద కన్నీటి ధార వర్షంగా వారి నెత్తిన అవతరిస్తున్నాయి

అతని కళ్లల్లో మృత్యువంటే భయం ఎట్లాంటిదో చూసింది. కాసేపు మూసుకుపోయి, ఆ మూతలో కాస్త తెరుచుకుని నల్లకొలికలో తెల్లపాప, నల్లటడివి మధ్యలో సెలయేరులో ఎగిరిపడిన చేపలా తళుక్కుమని, మళ్లీ చీకటిలో కరిగిపోయిన, 'భయం' అనే గుడ్డుని చూసి యిదివరకెన్నడూ ఎరగని జాలితో అతని తల లాక్కుని, తన వక్షంమీద ఆనించుకొని ఏడ్చేస్తోంది అలిమేలు. అంతటా తడి—నీరు—చెమ్మ—ఒకరిలో ఒకరు దాక్కుని, కలిసి పొడి చేసుకున్న ఆ కాస్త చోటు తప్ప—అక్కడే జీవం లంగరు వేసుకున్నట్లు, కాసేపు వూపిరి సలుపుతోంది—తడిలోంచి, నీటిలోంచి, అగ్ని పుట్టించినట్లు—రెండు ప్రాణులు ఒక్క శరీరాన్ని నిలబెట్టినట్లు—ఆమె మోకాళ్లమీద అతని పాదాలు—ఆమె రొమ్ములమీద అతని మోకాళ్ళు—ఆమె భుజాలపైన అతని తొడలు—ఎక్కడికో పైకి పారిపోతున్నాయి, జలగల్లా పట్టుకుని, ఆకాశంలో తొర్రని వెదుకుతూ—చేతులు ఆమె నెత్తిన పెట్టాడు—పాదాలు భుజాలపైన,—నిలబడ్డాడు—ఆ వొంగిన కొమ్మ మొదలు చేతికి చిక్కింది పట్టుకున్నాడు—కాళ్ళ పైకి లాక్కుని, ఆపై కొమ్మమధ్య కూలబడి, గట్టిగా పట్టుకుని, ముక్కుతూ, మూల్గుతూ సజీవంగా ఉన్నాడు సదాశివరావు

అలమేలు ఏడ్పు మానేసింది ఏడవడం సాధ్యం కావడంలేదు పైకి చూసింది పీడ విరగడైనాడు, సక్కంగా—మారాజు బ్రదికాడు అమ్మయ్య వూపిరి వొస్తోంది తొక్కి, నలిపేసేసి చంపేశాడు—నీళ్ళ పైకి రానీ, ఎంత వర కొస్తాయో చూస్తాను చస్తాను, అంతేగందా—ఆడి చేతుల్లో, కాళ్ల కింద పడి చావడం కంటె, గంగపాలవడం మంచిది ధీమాగా కూర్చుంది

''రా, రా, పైకి, రా'' అంటున్నాడు పైనుండి

రానన్నట్లు కిందికి చూస్తూ తల వూపడం అతనికి కనపడ్డంలేదు.

''భయమేస్తోంది. ఇదిగో—నా కాలట్టుకో.''

''నే రాను ''

''కోపమా ?''

''ఏడుపు ''

నవ్వాడు సదాశివరావు ఏమిటో అర్థంలేని సంభాషణ తను ఇష్టంగా ఉండడం మూలాన వర్షం ఆమెమీద పడుతున్నట్లు లేదు జుట్టు విడదీసి దులుపుకుంటోంది

''ఇదిగో—తీసుకో ''

పైకి చూసింది చేతులో ఏదో ఉంది కనబడ్డంలేదు.

''నుంచో—రాకపోతే, నేనే దిగుతాను—''

''వొద్దు ఇద్దరం పడి చస్తాం ''

''''ఇద్దరం చస్తే భయంలేదు ''

కాళ్ళు ఆమె బుజాలకి తగుల్తున్నాయి.

''తీసుకో.''

కాళ్ల వేళ్లలో ఏదో ఉంది తీసింది. తడిసిన రూపాయల నోట్లు. తనకంత కోపం ఉన్నట్లు తెలుసుకుని ఆశ్చర్యపడింది అలిమేలు. ఆ నోట్లు తీసుకుని ముక్కలు ముక్కలుగా చించి నీళ్లల్లో పారేసింది

"చాలా—ఇవిగో—ఇంకా ఉన్నాయి. దిగుతున్నా." అంటూనే కిందికి దిగాడు సదాశివరావు ఆమె పక్కగాతొలిగి కొమ్మని పట్టుగుని నుంచుంది· వర్షం నిలిచింది. కింద నది రొద ఎక్కువైంది. నీళ్లు వేగంగా కదిలి పోతున్నాయి హెచ్చిన వేగంతో రొద పెరిగింది. ఏవేవో చప్పుళ్ళు. తాటాకులు కాలినట్లు, డబ్బాలు ఢీకొన్నట్లు, దూలాలు విరిగి పడ్డట్లు. తన ఇంటి కప్పు కూలిపోవడం చూసింది అలిమేలు. గోడ విరిగి, కరిగి జారిపోయింది. ఇంటి భాగాలు నీళ్లల్లో పోతున్నాయి—అటుకేసి, నదికేసి, దూరంగా, ఇంకా దూరంగా చీకట్లోకి భయంతో వొణికిపోతూ కూలబడి ఆమె తొడలు పట్టుకుని కూర్చున్నాడు ఆమె వొంటిమీద మిగిలిన చీర చాలా భాగం వూడే పోయింది ఒక చేత్తో ఆమె స్తనాలు కప్పుకుంది, రెండోదానితో అతని పట్టు విదిలిస్తోంది. మరికొన్ని నోట్లిచ్చాడు. తీసుకొని చించి, నోట్లో నమిలి, నీళ్లల్లోకి వూసింది.

"అదేమిటి—?"

"ఉమ్ము"

"ఛీ, ఛీ—డబ్బు పారేశావా—ఏం ఇదిగా ఉంది. ఏవరవనుకున్నావు ?"

"చచ్చినదాన్ననుకున్నాను."

"డబ్బు చేదా ?"

"విషం."

అతని భుజంపైన పాదా లానించి, లేచి నిలబడి పై కొమ్మలోకి ఎగబాకి, మధ్య త్రొరలో కూలబడింది.

"నన్నొదిలేసి పోతావా ?"

"నువ్వొదిలెయ్యలా ?"

ఆశ్చర్యపడ్డాడు. భయంవల్ల కోపం ప్రకటించలేక పోతున్నాడు అది కోపం కూడా కాదు—అదొక ఉన్మాదం—ప్రాణి మరో ప్రాణిని వెదుక్కుని, నిలబడేందుకు చేస్తున్న ఆరాటం అని కూడా అతనికి తెలియదు ఆమె కావాలి—ఆక్షణాన అతను పొందిన అనుభవం—అదొక ప్రశాంతత, ప్రకృతి గుండెల్లో జొరబడి తను నాడై కొట్టుకుంటున్నట్లు—ఇదివర కెన్నడూ ఎరగడు దానికి స్వరూపం లేదు—అది కామం కాదు, వాంఛ కాదు సృష్టి రహస్యం తనలో వుంచుకొని దానిలో ఐక్యత పొంది సజీవు డైనట్లు—ఏమో—కావాలి ఇంకా కావాలి—లేకపోతే చచ్చిపోతాడు—ఆ కౌగలింపుతో చావడం ఎంతో అవసరంగా తోచింది. అతని వొళ్ళు తడిమంటలాగుంది ఆమె పాడినీరుగా—ఏమో—అర్థంలేని ఆలోచనలు.

"వొస్తున్నా—పైకి" అన్నాడు

అతని కంఠమే మారిపోయింది నది రొదలా వినిపించింది ఏవో అరుపులు, ధ్వనులు—భ్రమా, నిజంగానా ? మేఘాలు విడిపోతున్నాయి తొందరగా కదిలి మధ్యలో నిర్మలమైన ఆకాశం పచ్చటి గాజుపెంకులా, పధ్యం పుచ్చుగున్న చందమామ వెలుగులో మెరుస్తోంది. నీరసమైన చెట్టునీడలు నల్లగా నీళ్లల్లో పడి కొట్టుకు పోతున్నాయి. ఆ చందమామ చప్పగా ఉంది—కాని అదొక వెలుగులా, శరీరానికి వెచ్చగా తగిలినట్లనిపించింది అతనికి ఇంక దిగిపోతోంది చందమామ—వెలుగు పిలుపు వినిపించుకోని నల్ల మేఘాలు, వొంటిమీద కాల్చి వాతపెట్టినట్లు అంచులమీద వెలుగునీడ మోసుగుపోతున్నాయి పైకి చూశాడు ఆ వెలుగులో ఆమె మొహంమీద నీడలు పడుతున్నాయి అది నోరు, అది ముక్కు రంధ్రం, వొంపు కాబోలు—స్తనాలపైన సన్నటి కాంతికి, కింద వికృతంగా నీడలు సాగుతున్నాయి జుట్టు భుజాలమీద పడేసుకుంది. అది నడుం వొంపు—నునుపుతో, గుండ్రంగా మెరిసిపోతున్నాయి తొడలు—లేచి నిలబడ్డాడు— ఆమె రెండు పాదాలు తన మొహంమీదికి లాక్కుని, తల ఆమె వొడిలో దాస్తున్నాడు

ఏదో చప్పుడు. ఉలిక్కిపడ్డాడు దూలాల మోత మనిషి అరుపు—పెద్ద పెద్ద కేకలు—దూరంగా—నలుదిక్కులా పరకాయించి చూశాడు.

"ఏమిటది—అరుపు—వినబడుతోందా ?"

సమాధానం లేదు.

"విన్నే"

ఆమె మిగిలిన చీరని నడుం చుటూ బిగించుకుంటోంది ఆమెకి అతన్ని చూస్తే జాలి పుడుతోంది. పాపం—బ్రదికాడు—భలే కౌగిలించుకుంటాడు తనకీ అదో లాగుంది మనిషి తాకిడి కావాలి చలి, భయం, బాధ. మొగాడి వొళ్లు భలే ఉంటుంది—ఆ బుజాలు, కండలు— ఆ కంఠం, చేతులు, వెచ్చగా, తడిగా, వేడి రక్తం—నది వొడ్డున నల్లటి మనుషుల కండలు కదలిక జ్ఞప్తి కొస్తోంది. చెయ్యిపెట్టి తాకాలనుంది మోటగా ఉంటుంది. మోటతనం తనకి గిట్టదు—కాని అదే కావాలనుంటుంది ఎందుకో ఆయనంటే రోత—గిట్టదు కాని ఆ శరీరం అల్లా తాకితే హాయిగా ఉంటుంది. ఆ తలలో వేళ్లుపెట్టి, వెంట్రుకలని పీడించి, లెంప పగలెయ్యాలనుంటుంది——ఇదంతా ఏమిటో వెంకటేశ్వర్లు జ్ఞప్తికొచ్చాడు—పెద్దోడే—ఆడి వొళ్లు ఈసారి బాగా తాకి చూడాలి ఇంతైనాక, తనకేం భయం ? ఇదంతా బ్రతికి బైట పడింతర్వాత గదా—ఈలోగా, ఈయె నెట్లా—ఏదో చేసేలాగున్నాడు—ఇదేం కర్మ—అప్పుడు, అక్కడ, ఎవరు ఎవర్ని ఏంచేస్తే ఏంగాను—ఎవరి క్కావాలి ఎవళ్ల బ్రతుకులు వాళ్లవి.

ఎవళ్లకీ తెలియదు అమ్మకి తెలియదు, వెంకటేశ్వర్లుకి తెలి . ..

"అలిమేలూ" అంటూవున్న కేక విని నిలిచిపోయింది మళ్లా మళ్లా 'అలిమేలూ' అని పిలుస్తున్నా రెవరో. అవును తనపేరే ఎటు ? ఎక్కడ నుంచి ? ఆటూ ఇటూ చూస్తోంది నీళ్లు కిందికి దిగిపోతున్నాయి బాగా బాగి కిందికి—మరీ వేగంతో నదివైపు పల్లంలోకి

ఎవళ్లో గంగమ్మతల్లి పీక నులిమినట్లు, ఏడుస్తూ, రోదిస్తూ, బాధనుండి తప్పించుకు పారిపోతున్నట్లు, ఏమీ చేతకాక కసితో అన్నింటినీ పాడుచేసి పోవడం మంచి దన్నట్లు, నీళ్లు అందినదాన్నల్లా తోసి, త్రవ్వి, తన్ని, తన వెన్ను మీదికి లాక్కుని ఉడాయిస్తోంది. ఆ కేక అటు నుంచి—అన్ని రుప్పలు, పుంతలు, చెట్లు చేమ, డబ్బాలు, పెట్లె, దూడ, మేక, కర్రకంప, వేగంతో తను కూర్చున్న చెట్టు మొదలు చుట్టూ ప్రదక్షిణం చేసి, బలికెళ్లే మేకపిల్లలా, పీకతెగిన కోడిలా తిరిగి తిరిగి, కొట్టుకుపోతున్నాయి తన పేరు స్పష్టంగా వినబడుతోంది సందేహంలేదు

"ఎవరది ?" అని కింద నుంచి సదాశివరావు

మళ్లా పిలుపు 'అలిమేలూ' అని

'ఆ' అని బిగ్గరగా పలికింది పలికింది కాని కంఠంలోంచి మాట పైకి రాలేదు. నొక్కుకుపోయి గాలి మాత్రం బైటకొచ్చింది గొంతుకు సవరించుకుని, మరోసారి 'ఆ' అన్నది. కంఠంలో జీర—కత్తితో ధ్వనిని చీల్చినట్లు, దుప్పటి కప్పి పీకని నులిమినట్లు—'ఆ' అంటే లాభంలేదు ఏదో అనాలి

'ఉ నేనే—ఇక్కడ' అన్నది అలిమేలు. కొన్నిధ్వనులు, బైటపడ్డాయి. ఇంక ఫరవాలేదు. అదుగో ఆ కొండవైపునుండి ఏదో ఆకారం, తమ చెట్టు వైపుకి వొస్తున్నట్లుంది మళ్లా 'అలిమేలూ' అని కేకలు.

"ఆ, ఇక్కడ—ఇక్కడే' అని బిగ్గరగా పలికింది

"నోరు మూసుకో అరవకు" అంటున్నాడు శివయ్య

మళా, మళ్లా 'అలిమేలూ' అన్న కేక పెద్ద దవుతోంది ఆ ఆకారం—దేనిమీదో నిలబడి—పిలుస్తున్నట్లుంది దూలాలు కాబోలు—ఏదో పడవలాగుంది అతనే—వెంకటేశ్వర్లు పిలుపు తన వెంకటేశ్వర్లు తబ్బిబ్బుగా లేచింది—బొడ్డుకింద చీర కొంగు బిగించింది. అమ్మయ్య. వెంకటేశ్వరస్వామి బొమ్మ భద్రంగా ఉంది

"ఇక్కడ—ఇటు" కేకలేస్తోంది

అది పడవలాగుంది. ఇటొస్తున్నాడు.

"ఇక్కడ—నేనే—రా, రా, ఇటు"

అంటోంది. దిగాలి—కింది కొమ్మలోకి దిగాలి ఈ సదాశివయ్య లేచి నిలబడితే బాగుండును భుజంమీద కాలుపెట్టి దిగొచ్చు దిగాలి.

"ఇదిగో చూడు ."

అతను తనకేసి చూడ్డంలేదు. ఎట్లా ?

భద్రతకు, సేవకు
మీ
మోటారు బండ్లను
మా వద్ద
ఇన్సూరు చేయండి

ది
వాన్ గార్డ్
ఇన్సురెన్సు
కంపెనీ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు,
వాన్ గార్డు హౌస్
11/12, సెకండ్ లైన్ బీచ్,
మద్రాసు-1.

వచ్చు, వొచ్చే" అని అరుస్తున్నాడు వెంకటేశ్వర్లు. దగ్గర కొచ్చేశాడు.

"ఇటు, ఈ చెట్టుమీద" అన్నది అలివేలు

చెట్టు మొదల్లో దూలం పడవ తగులుకుని చప్పుడైంది. లేచి నిలబడ్డాడు వెంకటేశ్వర్లు.

నెత్తికి ఏదో తువాలు లాంటిది కట్టుగున్నాడు. చొక్కా లేదు. పొట్టి లాగు—వాడే—

"ఇక్కడ" అంది.

చెట్టు మొదట్లో తడుముతున్నాడు—పట్టుకోసం.

"అమ్మేదీ—నువ్వు బాగుండావా ?"

"అమ్మ బాగుందిలే …. "

ఏవో ధ్వనులు చేస్తున్నాడు. ముక్కుతూ, రొప్పుతూ. పట్టు చిక్కినట్లుంది. పాదం ఆనించాడు, ఒక చేత్తో కొమ్మ మొదలు పట్టుగుంటున్నాడు. ఒకచేత్తో కర్రబొమ్మ గట్టిగా పట్టుగుని, రెండోదానితో కొమ్మని కౌగలించుకుని, మెల్లగా కింది కొమ్మలోకి జారింది అలివేలు. శివయ్య వెన్నుమీద పాదం ఆనింది. ఏదో పెద్ద చప్పుడైంది. అదిరి కిందికి చూసింది—ఏడీ ? వెంకటేశ్వర్లు లేడు. 'దబ్బు' మని చప్పుడు—పడవేదీ ? అటుఇటు మంటూ దూలంపడవ కొట్టుకుపోతూంది—మనిషి లేడు—ఏడీ ?

"తోసేశావా ?"

అంది, సదాశివరావుకేసి కోరగా చూస్తూ

అతని చెయ్యి ఆమె నోటిమీద పడింది. రెండో చెయ్యి రొమ్ముమీద పెనవేస్తోంది. చేతిని కొరికింది 'అమ్మో' అన్నాడు సదాశివరావు తేరుకుని చూసేసరికి ఆమె లేదు. నీళ్లల్లో చప్పుడైంది. దూకేసింది. పడిపోయింది—నీళ్లల్లో కొట్టుకుపోతూంది. తన్నుకులాడుతోంది. జలజల కొట్టుకుంటూంది—'అమ్మో!' 'వెంకటేశ్వర్లూ'—'అయ్యో' అని కేకలు పెడుతోంది అదేదో రుప్పలాగుంది. అందులో ఇరుక్కుంది. తను దూకితే—? దూకగలడా ? దూకి ఏం ప్రయోజనం ? మొహం మోకాలుమధ్య దాచుకొని, అంటుష్టంగా, కళ్ళు సగం తెరిచి ఆమె కొట్టుకుపోతూన్న దృశ్యం, తనెరగనట్లు, తనకి తెలిసినట్లు చూస్తూ, గజగజ వొణికికోపోతూ కూర్చున్నాడు సదాశివరావు.

ఇంక మరి కేకలు లేవు. అరుపులు లేవు. వెనక్కి మళ్ళుతున్న నీటి రొద తప్ప అంతా ప్రశాంతంగా ఉంది.

గుండెలు కొట్టుకోడం లెక్కపెడుతూ కాలం తెలుసుకోలేకపోతున్నాడు.

నీళ్ళు గబగబా జారిపోతున్నాయి వొస్తువుల, కళేబరాలు శిల్పాలల్లే బురదలో ఇరుక్కుని నిల్చిపొయ్యాయి—పల్పటి పొరలా నీరు అక్కడక్కడ పారుతోంది—పాము కూసంలా—ఆ చెట్ల మధ్య, ఈ రాళ్ళ మధ్య, దూరంగా కొండ కనబడుతోంది. దానిమీద మిగిలిన తవ బంగళా—నుదుటిమీద చుట్టు కాల్పు మచ్చలాగు. అక్కడక్కడ బురద మరకలు చందమామ లేడు—గాలి స్తంభించింది. ఆకాశం, పసివాడి వొంటిమీదనుంచి కప్పు తీసేసినట్లు ముడుచుకొని తన్నుకునేటందుకు వోపిగ లేనట్లు, నిశ్చలంగా ఉంది. అది కాకి రెక్క—ఇది కుక్క కాలు, అది కంప, ఇవి గుడ్డపీలికలు. నాగరికత ముసుగు లోంచి బైట పడగా మిగిలిన ప్రకృతి—తనొక్కడే సజీవుడై ఉన్నాడు.—ఉన్నాడా? కళ్ళు విప్పి చూశాడు—వొంటిని గిల్లి చూసుకున్నాడు. ఊపిరాడుతోంది. ధ్వనులు వినబడుతున్నాయి. కనబడుతున్నాయి. దూరంగా ఆ కొండపక్క ఒకదీపం. మనుషుల అలజడి—అస్పష్టమైన కేకలు, ఏడ్పులు తెప్పలమీద జనం అటూ యిటూ నదివైపువ వొస్తున్నారు. అక్కడ నీరు పల్చబడింది. అటు

ఎత్తు. పడవలు నిలిచిపొయ్యాయి. తను కూర్చున్న చెట్టు కింద నీరు అంత లోతు లేదు దిగి చూడొచ్చు ఆ మడ్డిలోకి, రొంపిలోకి ఎట్లా దిగడం ? తనకింకా ధైర్యం లేదు. ఆ పిల్ల ఏమైందో ? ఎక్కడో ఇరుక్కుని ఉంటుంది వాడు ? వాడేవిటి మధ్యలో—ఎందు కొచ్చినట్లు. భలే సాహసం—రక్షించాలని వచ్చినట్లున్నాడు. ఏమైంది ? కాలుజారి పడిపొయ్యాడా ? 'నువ్వు తోశేసావా ?' అన్న అలిమేలు ప్రశ్న వినబడుతోంది తనెందుకు తోస్తాడు ? తన కాలుకి వాడి చెయ్యి తగిలి పట్టు సడలి పడిపొయ్యాడా ? అంతేనా ? తొయ్యలేదు. ఏమో. తనకేం జ్ఞాపకంలేదు. అసలు ఆ పిల్ల చెప్పేవరకూ వాడు పడ్డట్టే తెలియదు

"తోశేసావా ?" అని ఆమె ప్రశ్న కంటె, ఆ ప్రశ్న అడిగినప్పుడు ఆమె కళ్లల్లో చూపు అతన్ని మరింత బాధిస్తోంది—నిజంగా తను తోసేసి నట్లు, నమ్మేటట్లు చూసింది. కోరగా, నల్లపాప ఒక మూలగా లాగి, తన బలాన్నంతా ఆ తెల్లపాప మధ్యలోకి పూరించి, నల్లటి ఆకాశం మధ్యలో విరిగిన మెరుపులా, ఆ క్షణం ఒక జ్వాలగా ప్రజ్వరిల్లి దహించినట్లు—అబ్బ !—ఆ అబలకి, అమాయకపు పసిపిల్లకి,—అంతటి శక్తి, బలం ఉండడం తను తట్టుకోలేకపోతున్నాడు శరీరానికి, తెలివికి ఏం సంబంధం ఉన్నట్లు ? ఆ చూపులో ఆమె నిజస్వరూపాన్ని దర్శించినట్లు సిగ్గుతో తల వొంచుకున్నాడు కొన్ని కోట్ల కన్యలు అతనికేసి వేలు చూపి, ఒక్కసారి కసరి చూసి, పురుషజాతికి ఆ క్షణాన ఏకైక ప్రతినిధిగా ఉన్న తనని, నేరస్థుడిగా తీర్పుచేసి, శిక్ష విధించి అంతర్థానమైన అశరీర శక్తిలా—అత నది మరచిపోలేడు. కళ్లు గట్టిగా మూసుగున్నాడు సదాశివరావు.

వెన్ను విరుచుకుని లేవడానికి సిద్ధంగా ఉన్న సూర్యుడి పయనం తెలుపుతూ, బాకాలతో సాటింపుకి బైలుదేరినట్లు కిరణాల కొనలు ఆకాశాన్ని తాకి, మైల పడుతున్నట్లు, వెలవెల బోయి, నీరసించి, క్షీణించి మంచాన పడిన ప్రకృతిని బలాత్కారంగా లేపి కూచోబెడుతున్నట్లు—అలిమేలు ఆఖరిచూపు, అతన్ని తనలోకి నెట్టి, మరిలేవక అణగార మన్నట్లు స్తబ్ధుగా కూర్చుండిపొయ్యా డతను—ఆ తీక్షణమైన చూపులో. ఆమె రొమ్ములపోటు, బుజాల ఒత్తిడి, పొత్తి కడుపులో—మృదువైన బింకం, ఆ తొడల తొక్కిడిలో మెత్తదనం—అతన్ని ఆ చూపులోంచి పరకాయించి చూసి, తనలో తనని బంధించి, ఆ చీకటి కూపంలోంచి, కోటి సూర్యుల కిరణాల ఫహారాగానం లేవనెత్తలేవేమో

ప్రపంచంలో మనుషులు రెండే తెగలు—చంపేవారు, చంపలేనివారు. తాను రెండో తెగవాడు. కాని, కాని అలిమేలు ఫిర్యాదు ? ఇంతకీ ఎవరూ చావందే తన కెందుకా భయం ? వాడు—వా డెవడో వొచ్చాడు—ఆమెని తీసుకెడదామని—ఏమవును ? చస్తే మాట. ఇద్దరు చద్దురు. ఆ అవాంతరం తను తప్పించాడా ? చోటుకోసం తన్నుకులాడుకుని, ముగ్గురూ నీళ్లల్లో పడి చస్తే, ఎవరు ఎవర్ని చంపినట్లు !

కళ్లు మూతలు పడవు—కాని చూపు ఆనదు. ఇంక ఆలోచన లేదు. నత్తగుల్లలో పురుగులా మనస్సు ముడతలు పడి, ఒంటి అవయవాల మధ్య ముడుచుకుంది. ఎక్కడో మరో లోకంలో ధ్వనులు—మరో యుగంలోదృశ్యాలు—మనిషి రాకపూర్వం భూమిపై తిరుగాడిన ప్రాచీన జంతుజాలంక ళేబరాలు, కొండ రాళ్ళ మధ్య ఇరుక్కుని, కోటి సంవత్సరాలకి కొండ పగిలిమధ్య జాడ మిగిల్చినట్లు—ఏవేవో కనబడతాయి—దూరంగా దీపాలు—మనుషుల గుంపులు—బృందాల ఏడ్పులు—స్మశానంలో మంటలు—వస్తువులు, మట్టినీరు, తడిమంటలో తెల్లగా మెరిసిన ఎముకలు ఆర్పుతూ పొడినీళ్లపడుతున్నాయి ఆకాశంలోంచి.

పక్షుల అరుపు కాదు—మనుషులు—

"దిగండి."

తల పైకెత్తి చూశాడు మిగిలిన కంటితో. మనుషులు. మనుషులు—తనకోసం—డ్రైవరు—తనెరుగున్న పోలీసు—నౌకర్లు—ఇంకా ఎవరో—పంచులు, కర్రలు, తాళ్ళు. "దిగండి..." దింపుతున్నారు—దేనిమీదో పడుకో బెట్టారు. ఎటో తొక్కుపోతున్నారు. వెలుగు వెంటాడి, పెరిగి మూలల్లో విరిగిపోతోంది. కింద నీరు, బురద, ఆకులు, కొమ్మ—బంక—వడ్డి—పెట్టె, కుక్కతోక, మేక కాలు, గంపకింద కోళ్ళు—అది సూర్య కిరణం, కంటి రెప్ప కింద—రెప్పకింద తారట్లాడు తున్నది—ఆమె కంటిలో చివరి చూపు. —వేళ్లతో రెప్పని పైకి నెట్టి, క్షణం చూశాడు—అదిగో ఒక గుంపు—మధ్యలో ఎవరివో కాళ్ళు—ఎవరివో చేతులు—చుట్టూ మనుషులు—

"చచ్చింది పాపం—"

ఎవరో అంటున్నారు. ఎవరో.

చేతులో కర్రబొమ్మ—

వెంకటేశ్వరస్వామి కర్రబొమ్మ—చేతిలో

ఉండిపోయింది. ఎవరో అంటున్నారు.

'అదే—అలిమేలు.'

'ఆడికేం—అడుగో ఆ సైకిల్ కొట్టువాడు—వెంకన్న' 'అమ్మ కొంపలో లేదుగా సంత కెళ్లింది' 'దానికేం' 'ఇది' 'ఒకర్తే' 'పాపం—చచ్చింది.'

మరి .... ఈనకేం—ఆమె ముందుగానే .... "సువర్ణమ్మగారు పదిలంగానే ఉన్నారు. ఇంటికి వొచ్చేశారు.

లేచి కూర్చున్నాడు సదాశివరావు. గుంపు దూరమై పోయింది. ఆ చిక్కరేసుకున్నవాడేనా వెంకటేశ్వర్లు ! బాగానే ఉన్నాడే.

సముద్రంపై ఒక ఆవిరి తెర ఆకాశంలోకి లేచినట్లు, అతని మనస్సులో ఒక భాగం ఎక్కడికో లేచిపోయింది. ఊపిరి సాఫీగా రావడం లేదు—కాలిపోతున్న ఎడారి ఇసుకలో, ఎక్కడ పడినా కరిగిపోతానని భయపడి కిందికి పడని మంచుకణంలాగు, గుండె తటపటాయిస్తోంది.

ఆకలేస్తోంది కర్మ. ఇంటికి వొచ్చేశారు—

పీటి మేడ, తడి మంటలో కాలిపోతోంది—

చర్మం పీకిం తర్వాత ఎర్రటి మశూచి మచ్చ—కిరణం తాకిడితో కొన వూపిరితో నిలబడిన తనిల్లు—ఏకాంత మహా సంగ్రామంలో చావగా మిగిలిన తను—కంటి నీరు పొడిగా కారుతోంది పొడి పీటతో ఆతడి మంటని చల్లార్చగలడా ?—చల్లార్చగలగడం వింతలలో వింత.